క్లుప్తంగా

16న విద్యుత్ సరఫరా నిలిపివేత

కాకినాడ సిటీ: డ్రైవర్స్ కాలనీ 11 కేవీ ఫీడర్‌లో మరమ్మతుల కోసం ఈ నెల 16న విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ కాకినాడ డీఈఈ ఎస్ ఉదయ్‌భాస్కర్ బుధవారం తెలిపారు. ఈ నేపథ్యంలో 16న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మహాలక్ష్మినగర్, లక్ష్మీనగర్, నాయకర్ నగర్, సాయినగర్, డ్రైవర్స్ కాలనీ, అల్లూరి సీతారామరాజు కాలనీ, పగడాలపేట ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వివరించారు.

18న పద్మశాలీల వధూవరుల పరిచయ వేదిక

బోట్‌క్లబ్: పద్మశాలీల వధూవరుల వివాహ పరిచయ వేదిక ఈ నెల 18న కాకినాడలో నిర్వహించనున్నట్టు పద్మశాలీ సంక్షేమ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ వీరకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18న మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఈ కార్యక్రమం స్థానిక వెంకట్‌నగర్‌లోని కాకినాడ పట్టణ పద్మశాలీ సంక్షేమ సంఘ భవనంలో జరుగుతుందన్నారు. వధూవరులు తమ ఫొటో, బయోడేటా, తల్లిదండ్రులతో ముందుగా వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కాకినాడ, పరిసర ప్రాంతాల్లోని పద్మశాలీల బంధువులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధి కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పీఎంకేవీ పథకంలో భాగంగా కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో నిరుద్యోగులకు ఉపాధి కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాలవర్మ బుధవారం తెలిపారు. ఎలక్ట్రికల్ టెక్నీషియన్, అసిస్టెంట్ ఇన్సులేషన్ కంప్యూటింగ్ పెరిఫెరల్స్‌కు మూడు నెలల ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు వివరించారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 45 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. ఇతర వివరాలకు 87907 98431 నంబరుకు సంప్రదించాలన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసులో పలువురికి జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్-1, 2, టూటౌన్, త్రీటౌన్, సామర్లకోట, తిమ్మాపురం పోలీసు స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. నిందితులను బుధవారం కోర్టులో హాజరుపర్చగా, ఐదుగురికి ఒక్కొక్కరికి రెండు రోజుల జైలు, మరో ఇద్దరికి మూడు రోజులు, మరొకరికి ఐదు రోజుల జైలు, 8 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల వంతున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

300 అడుగుల త్రివర్ణ పతాకం



భారీ జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు

సామర్లకోట: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ ఆధ్వర్యంలో బుధవారం 300 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో ఈ ర్యాలీని కౌన్సిలర్ బలుసు వాసు ప్రారంభించారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడానికి జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించినట్టు హెచ్‌ఎం తెలిపారు. అయోధ్య రామపురంలోని హైస్కూల్ నుంచి మఠంసెంటర్, స్టేషన్ సెంటర్, బస్సు కాంప్లెక్స్, కొత్తూరు మీదుగా ర్యాలీ హైస్కూల్‌కు చేరింది. కౌన్సిలర్ పితాని కృష్ణ, విద్యా కమిటీ చైర్మన్ అక్కిన చక్రధర్, ఉపాధ్యాయులు కేవీవీ సత్యనారాయణ, జి.గోవిందు, ఏఎల్‌వీ కుమారి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, వల్లూరి గాంధీ, పడాల పుత్రయ్య, విద్యార్థులు పాల్గొన్నారు. ట్రాఫిక్ ఏఎస్సై రత్నం ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు నిర్వహించారు.

కబడ్డీ మీట్ విజేత నల్గొండ



విజేత జట్టుకు బహుమతి ఇస్తున్న ఆర్డీసీ

పెద్దాపురం: మూడు రోజులుగా స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో నిర్వహించిన రీజినల్ కబడ్డీ మీట్ బుధవారం సాయంత్రం అట్టహాసంగా ముగిసింది ఈ పోటీల్లో నల్గొండ జట్టు చాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది. విద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య అధ్యక్షతన జరిగిన ముగింపు సభలో ఆర్డీసీ జె.సీతారామారావు విజేత జట్టుకు బహుమతులు అందజేశారు. విద్యతో పాటు క్రీడలకూ ప్రాధాన్యమిచ్చి, అన్ని రంగాల్లో రాణించాలన్నారు.

సాగర తీరం.. త్రివర్ణ శోభితం



విద్యుద్దీపాలంకరణతో ముస్తాబైన కలెక్టరేట్



జెండా వందనం కోసం ముస్తాబైన కాకినాడ ఎన్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులోని కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయం

- జెండా పండగకు సర్వం సిద్ధం
- విద్యుద్దీపాలతో కలెక్టరేట్ ముస్తాబు
- ప్రభుత్వ కార్యాలయాలు, ప్రముఖ కూడళ్లలో సన్నాహాలు

కాకినాడ సిటీ/కాకినాడ రూరల్: పంద్రాగస్టు అంటేనే యావత్ భారతవనికి పెద్ద పండగ. తెల్ల దొరల బానిస సంకెళ్ల నుంచి విముక్తి పొంది, స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్న పండగ ఇది. దేశ 78 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కోసం ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలలు అందంగా ముస్తాబయ్యాయి. జెండా వందనం కోసం మువ్వెన్నెల జెండా కర్రలను సిద్ధం చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు కాకినాడ నగరం ముస్తాబైంది. నగరంలోని ప్రభుత్వ కార్యాలయాలు విద్యుద్దీప కాంతులతో ధగధగా మెరుస్తున్నాయి. కాకినాడ కలెక్టరేట్ కార్యాలయాన్ని త్రివర్ణ పతాకం రంగులతో, విద్యుద్దీపాలతో ఆకర్షణీయంగా అలంకరించారు. కాకినాడ రమణయ్యపేట వైద్యనగర్‌లో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు గురువారం ఉదయం జెండా ఆవిష్కరణ చేయనున్నారు. ఇందు కోసం ఏర్పాట్లు చేశారు.

78 ఆకారంలో విద్యార్థుల విన్యాసం



78 ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

కరప: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లయిన సందర్భంగా గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులు అదే సంఖ్య ఆకారాన్ని ప్రదర్శించారు. హెచ్‌ఎం ఎ.సాయిమోహన్, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు, పీడీ కె.నాగలింగేశ్వరరావు విద్యార్థులతో ఈ విన్యాసాన్ని చేయించారు. వారి చెంతనే ఉపాధ్యాయులు జాతీయ జెండాలతో నిలబడి ప్రోత్సహించారు.

ప్రతి ఇంటిపై జెండా ఎగరాలి

బోట్‌క్లబ్: జాతీయ జెండాను ప్రతి ఇంటిపైనా ఎగురవేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కవికొండల భీమశేఖర్ అన్నారు. బీజేపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక గాంధీనగర్ మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి జాతీయ పతాకాలు చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. పార్టీ కాకినాడ సెంట్రల్ మండల ప్రధాన కార్యదర్శి కవికొండల చలపతిరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సుమారు 400 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న భీమశంకర్

ఆక్రమణలను ఉపేక్షించేది లేదు

కార్పొరేషన్ కమిషనర్ భావన హెచ్చరిక



ప్రతాప్‌నగర్ కెనాల్ కాలువ ప్రాంతంలో ఆక్రమణలు తొలగింపజేస్తున్న కమిషనర్

కాకినాడ: రహదారుల ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన హెచ్చరించారు. కాకినాడ–సామర్లకోట కెనాల్ రోడ్డు సుందరీకరణ, కాలువ వెంబడి ఏర్పాటు చేయనున్న ఫెన్సింగ్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించిన కమిషనర్ బుధవారం మరోసారి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ప్రతాప్‌నగర్ సమీపంలో రహదారి పక్కన ఏర్పాటు చేసిన బడ్డీలను, ఇతరత్రా ఆక్రమణలను తొలగింపజేశారు. అలాగే కెనాల్ రోడ్డు పక్కన కొబ్బరి బొండాలు, చెత్త డంపింగ్ చేయకుండా చూడాలని ఎంహెచ్‌ఓ పృథ్వీచరణ్, ఇతర అధికారులను ఆదేశించారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని ఆమె కోరారు. ఇంకా ఆమె వెంట శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి



ముగింపు సభలో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ సత్యనారాయణ

కరప: సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ ద్వారా స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్ది, వాటి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని ఈఓపీఆర్డీ బీఏ సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో బుధవారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల మూడు రోజుల శిక్షణ తరగతుల ముగింపు సభలో ఆయన మాట్లాడారు. ప్లాస్టింగ్ వస్తువులు వాడటం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించి, ప్లాస్టింగ్ వాడకం నియంత్రించాలన్నారు. పంచాయతీ చట్టం, విధులపై పూర్తిగా అవగాహన కల్పించుకుని, ప్రణాళికా బద్ధంగా గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. పంచాయతీ పరిపాలన, అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన, పారిశుధ్యం పనులు, ఘన వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా, ఎల్‌ఈడీ వీధిలైట్ల నిర్వహణ, ప్లాస్టింగ్ వాడకం నియంత్రణ, కుక్కలు, పందుల నియంత్రణ తదితర అంశాలపై పంచాయతీ కార్యదర్శులు వి.సునీల్‌కుమార్, వై.రాంజీ హీరాలాల్ అవగాహన కల్పించారు.

జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలి



క్యాంపస్ అధ్యాపకులు, విద్యార్థులతో ఆచార్య ప్రేమానందం

కాకినాడ రూరల్: ప్రణాళికాబద్ధంగా, స్థిరమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆంధ్రా యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి ఆచార్య పేటేటి ప్రేమానందం అన్నారు. స్థానిక అచ్చంపేటలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంఎస్ఎన్ క్యాంపస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో 2022–24 విద్యార్థుల వీడ్కోలు, అతిథి ఉపన్యాసం బుధవారం నిర్వహించారు. కోర్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.జోసెఫ్ స్టీఫెన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆచార్య పేటేటి ప్రేమానందం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో పొలిటికల్ సైన్స్ డిపార్ట్‌మెంట్‌లో చదివిన అనేక మంది పూర్వ విద్యార్థులు దేశంలో వివిధ హోదాల్లో ఆచార్యులుగా, ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్–1, గ్రూప్–2 ఆఫీసర్లుగా పనిచేస్తున్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆచార్య ప్రేమానందాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతిశ్రీ, డాక్టర్ కె.జోసెఫ్ స్టీఫెన్, సహాయ ఆచార్యులు నానిబాబు, డాక్టర్ కె.హరిబాబు, డాక్టర్ ఎం.గోపి తదితరులు సత్కరించారు.

ముగిసిన శిక్షణ తరగతులు



కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ విరీష, ఎంపీడీఓ రమేష్‌నాయుడు తదితరులు

కాకినాడ రూరల్: మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ, సచివాలయ కార్యదర్శులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. గ్రామాలలో వీధి దీపాలు, పారిశుధ్య నిర్వహణ, గ్రామాభివృద్ధికి ప్రణాళికల తయారీ తదితర అంశాలపై ఎంపీడీఓ రమేష్‌నాయుడు, ఈఓపీఆర్డీ నాగేంద్రకుమార్ శిక్షణ ఇచ్చారు. ఎంపీపీ బందిలి విరీష ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని ఆమె అన్నారు. వారికి ప్రభుత్వ పరంగా అండగా ఉండి, సహకరించాల్సిన బాధ్యత కార్యదర్శులపై ఉందన్నారు. మండలంలోని సీనియర్ పంచాయతీ కార్యదర్శులు జొన్నాడ నరసింహారావు, పాండురంగారావు ట్రైనీలుగా పలు అంశాలుపై అవగాహన కల్పించారు.

ఐటీసీకి పునరుత్పాదక వ్యర్థాల అందజేత

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆదిత్య విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పునరుత్పాదక శక్తి ఉన్న 1,93,426 కిలోల వ్యర్థాలను ఐటీసీ సంస్థకు అందజేసింది. కాగితాల తయారీకి ఉపయోగించే 3,880 చెట్లకు ఇది సమానం. వెల్ బీఇంగ్ అవుట్ ఆఫ్ వేస్ట్ అనే సంస్థ వ్యర్థాలను కాగిత పరిశ్రమలో ముడి సరుకుగా ఉపయోగిస్తూ, సహజ వనరులను సంరక్షించేందుకు కృషి చేస్తోంది. ఈ ప్రాజెక్టులో ఆదిత్య విద్యార్థులు భాగస్వాములై సహకారం అందించారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల చైర్మన్ శేషారెడ్డి, డైరెక్టర్ శృతిరెడ్డిని ఐటీసీ సంస్థ బృందం అభినందించింది.

ఫిజియో థెరపీతో నొప్పుల నివారణ



ఫిజియో థెరపీపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వెంకట రమణ

కాకినాడ రూరల్: వివిధ వ్యాయామ వైద్య ఉపకరణాలతో రోగికి చేసే ఫిజియో థెరపీతో దీర్ఘకాలిక నొప్పుల నుంచి ఉపశమనం కలుగుతుందని వైద్య నిపుణుడు డాక్టర్ కె.వెంకట రమణ అన్నారు. అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక రమణయ్యపేటలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఫిజియో థెరపీ ద్వారా శరీరంపై ఎటువంటి గాట్లు లేకుండా, బయట నుంచే వ్యాయామ రూపంలో కానీ, మెషీన్ ద్వారా కానీ చేసే ప్రక్రియ అని చెప్పారు. ఎముకలు, నరాలు, కీళ్ల, కండరాల నొప్పులు, పక్షవాతం, అంగ వైకల్యంతో పాటు, క్యాన్సర్ వల్ల వచ్చే నొప్పులకు ఉపశమనం కలుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు అడబాల రత్నప్రసాద్, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వద్దు.. చేనేత జెండాలే ముద్దు



చేనేత జెండాలను పంపిణీ చేస్తున్న అడ్డాల

బోట్‌క్లబ్: హాని కలిగించే ప్లాస్టిక్ జెండాలు వద్దు, చేనేత జెండాలే ముద్దు అని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక భానుగుడి వద్ద బుధవారం చేనేత జెండాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. స్వాతంత్ర్య దినోత్సవంలో వాడే రబ్బరు బుడగల వల్ల జంతువులకు, పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత జెండాలను అందరూ వాడేలా అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కార్యాచరణ చేపట్టాలని కోరారు. సంఘ అధ్యక్షుడు చిట్ల కిరణ్ మాట్లాడుతూ ఈ ఏడాది ప్రజలందరూ పర్యావరణ హిత స్వాతంత్ర్య వేడుకలు జరపాలని కోరారు.

స్వాతంత్ర్య పోరాటంలో సాహస ఘట్టం

- ఉద్యమ స్ఫూర్తిని నింపిన పెద్దాపురం పురపాలక సంఘం ఘటన
- సత్యాగ్రహానికి మద్దతుగా ప్రప్రథమంగా జాతీయ జెండా ఆవిష్కరణ



ప్రప్రథమంగా జాతీయ జెండాను రెపరెపలాడించిన అప్పటి పెద్దాపురం మున్సిపల్ కార్యాలయం (ఫైల్)

పెద్దాపురం: ఎందరో మహానుభావులు స్వాతంత్ర్య ఉద్యమంలో చేసిన త్యాగాలు, కృషి ఎనలేనివి. ఆ సమయంలో బ్రిటిష్ అధికారులను ఎదిరించి, సత్యాగ్రహానికి మద్దతుగా పురపాలక సంఘాలపై జాతీయ జెండాను ఎగురవేయడంలో పెద్దాపురం మున్సిపాలిటీ ప్రప్రథమ స్థానంలో నిలిచింది. సత్యాగ్రహానికి మద్దతు ఇవ్వవద్దని, ఎటువంటి కార్యక్రమాలు చేపట్టరాదని అప్పటి పెద్దాపురానికి చెందిన నాయకులు,, యువకులకు బ్రిటిష్ పోలీసులు ఆజ్ఞలు జారీ చేశారు. అయినప్పటికీ పెద్దాపురం నాయకులు ఉద్యమ స్ఫూర్తితో ఏ మాత్రం తగ్గకుండా, పెద్దాపురం పురపాలక సంఘ కార్యాలయంపై ప్రప్రథమంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. అంతేగాక దేవతా ఉత్సవం వద్ద మహాత్మా గాంధీ చిత్రపటాన్ని ఉంచి ఊరేగించారు. అప్పటి ఆంధ్రపత్రికలో ప్రచురించిన వార్త నేటికీ పదిలంగా, చారిత్రక సాక్ష్యంగా ఉంది. పురపాలక కార్యాలయ భవనాల్లో తొలుత పెద్దాపురం మున్సిపాలిటీలో జాతీయ జెండా రెపరెపలాడింది. అనంతరం అప్పటి బొంబాయి సత్యాగ్రహాన్ని బలపరుస్తూ, గుంటూరు, చీరాల, తెనాలి, నెల్లూరు, రామచంద్రపురం పురపాలక సంఘాల్లో స్వాతంత్ర్య యోధులు జాతీయ జెండాలు ఆవిష్కరించి తమ దేశభక్తిని చాటారు.

అలుపెరుగని పెద్దాపురం యోధుడు



స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న కాండ్రకోట వాసి పొక్కులూరి సత్యనారాయణ (ఫైల్)


పెద్దాపురం: చెన్నపురి స్వాతంత్ర్య ఉద్యమంలో కాకినాడ జిల్లా పెద్దాపురం తాలుకాకు ఓ గుర్తింపు ఉంది. 1940 జూన్ 26న చెన్నపురి చైనా బజారు రోడ్డులో సత్యాగ్రహం చేస్తూ, యుద్ధ వ్యతిరేక నినాదాలు చేయడంతో కొందరిని అరెస్టు చేసి, ఫ్లవర్ బజార్ పోలీస్ స్టేషన్‌కు తరలించి, తర్వాత కోర్టులో హాజరుపర్చారు. అందులో తొలి పోరాట యోధుడే పెద్దాపురం మండలం కాండ్రకోటకు చెందిన పొక్కులూరి సత్యనారాయణ. 1940 జూన్ 27న సత్యాగ్రహ ఉద్యమంలో ఆంధ్రాకు చెందిన ఏడుగురిని అరెస్టు చేయగా, మొదటి వ్యక్తి కాండ్రకోటకు చెందిన పొక్కులూరి సత్యనారాయణ (పెద్దాపురం తాలుకా). ఆయనతో పాటు సోమేశ్వరానికి చెందిన నాగదేవర వెంకట్రావు (రామచంద్రపురం తాలూకా), వానపల్లికి చెందిన బండారు వెంకట్రాజు (రాజోలు తాలూకా), వన్నె చింతలపూడికి చెందిన నడింపల్లి సీతారామరాజు (అమలాపురం తాలూకా), పాణింగపల్లికి చెందిన అయ్యల సోమయాజులు కామేశ్వరరావు (రామచంద్రపురం తాలూకా), బి.తాటిపర్తికి చెందిన నామా మార్కు (పిఠాపురం తాలూకా), గొల్లప్రోలుకు చెందిన ఈయుణ్ణి వీర రాఘవచార్యులు (పిఠాపురం తాలూకా) అప్పటి బ్రిటిష్ వారు పెట్టిన కేసులో అరెస్టు అయి, స్వాతంత్రోద్యమంలో కీలకపాత్ర పోషించారు.

జైలు జీవితం.. సేవలు

యుద్ధానికి ప్రధాన సూత్రధారి అనే అభియోగంపై పొక్కులూరి సత్యనారాయణ 1941 జూన్ 28 నుంచి అక్టోబర్ 15 వరకు సుమారు నాలుగు నెలల 12 రోజుల పాటు బళ్లారి ఆలిపురం జైలులో శిక్ష అనుభవించారు. 1943 నుంచి 1946 వరకు తూర్పు గోదావరి జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కాకినాడ కార్యాలయంలో పనిచేశారు. 1967 జూలై 14న లో విలేజ్ గైడ్ వర్కర్‌గా పదవీ విరమణ పొందారు. అప్పట్లో 35 రూపాయల రిటైర్మెంట్ పింఛనుతో కుటుంబాన్ని పోషించేవారు.

కాండ్రకోటలో కుటుంబం

ఆయన చిన్నాన్న పిల్లల కుటుంబం నేటికీ కాండ్రకోట గ్రామంలో నివసిస్తున్నారు. 1912 ఆగస్టు 15న జన్మించిన పొక్కులూరి సత్యనారాయణ 2004 ఏప్రిల్ ఆరున హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. ఆయనకు ఏడుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. ముగ్గురు కుమారులకు, ఓ అమ్మాయికి వివాహం కాగా, మిగిలిన వారికి నేటికీ అవివాహితులుగానే ఉన్నారు. వారు హైదరాబాద్‌లో ఉంటున్నట్టు, ఇక్కడ ఆయన ముని మనవడు పొక్కులూరి శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. తమ తాత గారు స్వాతంత్రోద్యమంలో పాల్గొనడం తమకు గర్వంగా ఉందని చెప్పారు. కుటుంబ సభ్యులందరూ ఆగస్టు 15న ఏటా ఆ మహనీయునికి నివాళులర్పిస్తామన్నారు.



7 గురు ఆంధ్ర సత్యాగ్రహులఅరెస్టు

పత్రికల్లో సత్యనారాయణ అరెస్టుపై వచ్చిన వార్త



ఆంధ్రదేశంలో స్వాతంత్ర్య దినోత్సవములు

పతాకావిష్కరణ ఘటనపై అప్పటి పత్రిక క్లిప్పింగ్

స్వామిపై దేశభక్తి..



త్రివర్ణ పతాక అలంకరణలో వేణుగోపాల స్వామివారు

పిఠాపురం: దైవభక్తిలో దేశభక్తిని చాటుకున్నారు పిఠాపురం రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయ అర్చకుడు విజయజనార్దనాచార్యులు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఆలయంలో స్వామి వారిని వినూత్నంగా మూడు రంగుల పూలతో త్రివర్ణ శోభితుడిగా అలంకరించారు. స్వామిపై దేశ భక్తిని చాటుకోవడంతో ఆయనను పలువురు అభినందించారు.